

దేవుడి మీద భారం

శివాలయ అర్చకుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. సాయం కోసం అర్థిస్తున్నాడు.

- 8లో



భక్తిశ్రద్ధలతో ఈస్టర్

ఈస్టర్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సమాధుల వద్ద ప్రార్థనలు చేశారు.

- 8లో



విద్యుత్ షాక్‌కు గురై..

విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందారు. ఇంటి పని చేస్తుండగా షాక్ కొట్టింది.

- 8లో

న్యూస్‌రీల్

సత్యనారాయణ నేత్రదానం



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని ఇప్పిలి వీధిలో నివాసం ఉంటున్న నారంశెట్టి సత్యనారాయణ (86) అనారోగ్య కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుమారులు ఎన్‌వీ మొహెర్ సుధాకర్, ఎన్‌వీ సురేష్, ఎన్‌వీ రవికిషోర్, జగదీశ్వరరావులు బరాటం వరప్రసాద్ ద్వారా తండ్రి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇంచార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు సత్యనారాయణ కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లను అభినందించారు.

ఆదిత్యునికి విశేష పూజలు



సూర్యనమస్కారాల పూజలు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం విశేష పూజలు, అర్చనలు జరిగాయి. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వాతావరణంలో మార్పులు, తీవ్ర ఎండలు, ఉక్కబోతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఆలయం తరఫున ఈవో వై.భద్రాజీ భక్తుల కోసం టెంట్లు, పాదాలకు రక్షణగా ఎర్రతివాచీలు వేయించడంతో కొంతమేరకు ఉపశమనం కలిగింది. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు తొలిసారిగా కుటుంబ సభ్యులతో కలిసి ఆదిత్యుడిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన పథకంలో భాగంగా భక్తులు అన్నదానం స్వీకరించారు. అయితే రుచి, శుభ్రత విషయంలో భక్తులు కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,66,700, విరాళాలు, ప్రత్యేక ఆర్జిత సేవల ద్వారా రూ.70,548, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.40 లక్షలు వరకు ఆదాయం లభించినట్లుగా ఈవో భద్రాజీ తెలిపారు.

ఎరక్కపోయి ఇరుక్కుని..



కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కేటీ రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు ఆర్టీసీ బస్సులు పక్కపక్కన వెళ్తున్న సమయంలో ఓ ఆటో వాటి మధ్య నుంచి వెళ్లి ఇరుక్కుపోయింది. డ్రైవర్ తప్ప ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాశీబుగ్గలో ఆటోలు బస్టాండ్‌లో ప్రవేశించి ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడమే ఇందుకు కారణమని స్థానికులు తెలిపారు.


అక్కడ నేతల బాస.. ఇక్కడ కూర్మాల మృత్యుఘోష



చాలా ఏళ్ల తర్వాత జిల్లాలో మళ్లీ బీచ్ ఫెస్టివల్ జరిగింది. బారువలో నిర్వహించిన ఈ ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రితో సహా వక్తలంతా కూర్మ రక్షణపై పెద్ద పెద్ద బాసలు చేశారు. నక్షత్ర తాబేళ్ల పిల్లలను సాగరంలోకి విడిచిపెట్టారు. బాగానే ఉంది. కానీ సాక్షాత్తు శ్రీమహా విష్ణువు కూర్మావతారంలో వెలసి పూజలందుకుంటున్న ప్రపంచంలోనే అరుదైన పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో విష్ణు స్వరూపమైన తాబేళ్ల హననం నిత్యకృత్యంగా మారింది. కూర్మాల మృత్యుఘోష స్థానికులను, భక్తులను కలవరపాటుకు గురిచేస్తోంది. వాటి రక్షణకు పాలకులు చర్యలు చేపట్టకపోగా.. మృత్యువాత పడుతున్న తాబేళ్లను ఆలయం వెనుక భాగంలోనే దహనం చేస్తూ ఆలయ పవిత్రతను దెబ్బ తీస్తున్నారు. ఇది చూసి మాటల్లో కాకుండా చేతల్లో నిజాయితీ చూపని నేతల తీరును ప్రజలు గర్హిస్తున్నారు. - గార



బారువలో తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెడుతున్న దృశ్యం



కూర్మనాథాలయం ఈఓ కార్యాలయం వెనుక భాగంలో మంటల్లో సగం కాలిపోయి ఉన్న తాబేళ్లు

ప్రకృతి పరిరక్షణ.. తాబేళ్ల సంరక్షణ

- బీచ్ ఫెస్టివల్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజల్లో ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం, ముఖ్యంగా అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రాముఖ్యతను తెలియజేయడమే ప్రధాన ఉద్దేశంగా ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు సోంపేట మండలం బారువ తీరంలో బీచ్ ఫెస్టివల్ పేరుతో అధికారులు ఏర్పాటు చేశారు. ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సాగరంలోకి విడిచిపెట్టారు. తాబేళ్ల సంరక్షణ కోసం అటవీశాఖ తీసుకుంటున్న చర్యల్ని వివరిస్తూ.. ప్రత్యేక ప్రదర్శనల్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ద్వారా తాబేళ్ల జీవిత చక్రం, వాటికి ఎదురవుతున్న సవాళ్లు, వాటిని రక్షించడానికి మనం చేయగలిగే పనులు వంటి విషయాలను ప్రజలు అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చాలా హడావిడిగా కార్యక్రమాలు చేశారు.

తాబేళ్ల సంరక్షణే ధ్యేయం..



ఈ ఏడాది రెండు లక్షల తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సముద్రంలోకి విడిచి పెట్టకుండా సేఫ్ డిస్పోజల్ చేయాలి. జిల్లాలో 16 కేంద్రాలు ద్వారా తాబేళ్ల పిల్లలను సంరక్షించి సముద్రంలోకి విడిచి పెట్టడం జరుగుతుంది. ఈ అంతరించిపోతున్న జీవజాతులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపై ఉంది. తాబేళ్లను రక్షించడానికి స్థానిక మత్స్యకారులు సహాయ సహకారాలు అవసరం.

– బీచ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అధికారుల నిర్లక్ష్యమే కారణం



శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాతకు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణం. ఆరోగ్యం, ఆహార పరిస్థితులపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. అందుకే పెద్ద సంఖ్యలో నక్షత్ర తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి. అనుపోజు నాగరాజు, దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు

ప్రతి నెలా నివేదికలిస్తున్నాం

శ్రీకూర్మనాథుడి ఆలయంలోని తాబేళ్ల పార్కు లో ఉన్న తాబేళ్లు, వాటి ఆరోగ్య పరిస్థితులపై ప్రతి నెలా జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖాధికారికి నివేదికలు పంపిస్తున్నాం. పార్కులో ఉన్నంత వరకు లెక్క కచ్చితంగానే ఉంది. ఆరోగ్య పరీక్షలు, ఆహారం ఏర్పాట్లు నిపుణుల సూచన మేరకు నిర్వహిస్తున్నాం.

–రమణమూర్తి, గ్రీన్‌మెర్సీ సంస్థ, శ్రీకాకుళం

ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో తాబేళ్లు మరణిస్తున్నాయి. దేవుడి ప్రతిరూపంగా ఇక్కడ తాబేళ్లను కొలుస్తారు. అలాంటిది ఇవి పదుల సంఖ్యలో చనిపోతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పైగా చనిపోయిన తాబేళ్లను ఆలయ ఈఓ కార్యాలయం వెనుక భాగంలోనే దహనం చేస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ తాబేళ్లు అనారోగ్య పరిస్థితుల్లో చనిపోతే తప్పనిసరిగా పోస్టుమార్టం నిర్వహించాలి. గతంలో ప్రతి తాబేలుకి నంబర్ కూడా కేటాయించేవారు. పార్కులో ఎన్ని ఉన్నాయి, వాటి ఆరోగ్య పరిస్థితులు రికార్డు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. అటవీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే తాబేళ్లు చనిపోతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరుదైన నక్షత్ర తాబేళ్లు...

ఈ ఆలయంలో ఉండేవి నక్షత్ర తాబేళ్లు. తరతరాలుగా వీటిని ఇక్కడే భక్తుల పూజించడం వల్ల ఆలయంలో పెంపకం జరుగుతోంది. ఆలయం దక్షిణ ద్వారం వద్ద తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేకంగా తాబేళ్ల పార్కును నిర్మించారు. వీటి కోసం ప్రతి నెలా రూ. 24 వేలు ఆహారంతో పాటు మెడికల్ ఖర్చుల కోసం జిల్లాకు చెందిన గ్రీన్‌మెర్సీ సంస్థకు దేవదాయ శాఖ అప్పగించింది. అయితే తాబేళ్ల సంరక్షణ సరిగ్గా లేకపోవడం, వాటి ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పరీక్షలు జరగాల్సి ఉన్నా అవేమీ లేకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నాయని భక్తులు చెబుతున్నారు. అదే సమయంలో కొన్ని నెలల క్రితం నుంచి భక్తుల వద్ద నుంచి తాబేళ్ల ఆహారం కోసం విరాళాలు తీసుకునేందుకు ప్రత్యేక కౌంటర్ కూడా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వచ్చిన ఆదాయంపై ఉన్న దృష్టి వాటి సంరక్షణపై లేదని భక్తులు మండిపడుతున్నారు.

కూర్మనాథా రక్షమాం..

- శ్రీకూర్మనాథాలయంలో తాబేళ్ల మృత్యువాత
- ఈఓ కార్యాలయం వెనుకనే తాబేళ్లను దహనం చేస్తున్న వైనం
- తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు



కూర్మనాథాలయంలోని తాబేళ్ల పార్కు

ఏదీ సంరక్షణ..

తాబేళ్ల పార్కులో గతంలో తాబేళ్ల పిల్లలు వచ్చే సమయంలో ప్రత్యేకంగా టబ్బులో వీటిని ఉంచి రక్షణ చర్యలు చేపట్టేవారు. ఎన్ని జన్మించాయి, వాటి వివరాలు, చనిపోయిన వివరాలు రికార్డులో నమోదు జరగాల్సి ఉన్నా అవేమీ జరగడం లేదని పరిస్థితులను చూస్తే అర్థమవుతుంది. ఈ విషయమై ఆలయ సిబ్బంది నర్సుబాబు వద్ద ప్రస్తావించగా ఏడు తాబేళ్లు చనిపోయి ఉన్నాయని, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

హైకోర్టు ఆదేశాలున్నా..



నక్షత్ర తాబేళ్లు అంతరించిపోతున్న అరుదైన జాతుల్లో ఉన్నాయి. భారతీయ వన్య ప్రాణ సంరక్షణ చట్టంలో ఈ నక్షత్ర తాబేళ్లు షెడ్యూల్ 4వ జాబితాలో ఉన్నాయి. వీటిని బంధించినా, తరలించినా కఠిన శిక్షలు అమలవుతాయి. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉండటం, అతి పురాతనమైన ఆలయం కావడం వలన కూర్మనాథాలయంలో తాబేళ్లను ఉంచవచ్చని, వాటిని సంరక్షణను చూడాల్సిన బాధ్యతను దేవదాయ శాఖ చేపట్టాలని హైకోర్టు స్పష్టంగా పేర్కొంది. సుమారు 15 ఏళ్ల క్రితం తాబేళ్ల సంరక్షణపై మీడియాలో కథనాలు రావడంతో వీటిపై హిందూ ధార్మిక సంఘాలు, వన సంరక్షణ ప్రేమికులు కోర్టులో కేసులు దాఖలు చేశారు. నిపుణుల ఆధ్వర్యంలో పార్కును ఏర్పాటు చేయాలని, వీటిని దేవదాయ ధర్మాదాయ శాఖతో పాటు అటవీ శాఖ అధికారులు తరచూ పరిశీలన చేయాలని ఆ తీర్పులో స్పష్టంగా పేర్కొన్నారు. అదే సమయంలో కృష్ణం వందే జగద్గురుమ్ అనే సంస్థ ఇప్పుడున్న తాబేళ్ల పార్కును నిర్మించింది. పార్కులో నీటి తొట్టెలు, వివిధ రకాలైన మొక్కలతో పాటు ఇసుక తిన్నెలు ఏర్పాటు చేసింది.

పోస్ట్‌మార్టం చేయకుండానే..

నక్షత్ర తాబేళ్లు మరణిస్తే వాటికి అటవీశాఖ ఆధ్వర్యంలోని వెటనేరియన్ అధికారి సమక్షంలో పోస్టుమార్టం చేయడం తప్పనిసరి అని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఆలయంలో అలా జరగడం లేదు. ఎక్కడ పడితే అక్కడ పాతేయడం.. దహనం చేయడం లాంటివి చేయడం చట్టరీత్యా నేరం. కానీ ఇక్కడ ఆలయ ప్రహరీ సమీపంలో దహనం చేసేస్తున్నారు. వీటి మరణాలపై అంత్య గోప్యత ఎందుకని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'లెక్క'లేని తనం..

ఐదేళ్ల క్రితం నక్షత్ర తాబేళ్ల సంతతి 280 వరకు ఉండేదని స్థానికులు చెబుతున్నారు. వాటి సంతతి వృద్ధి చెంది తాబేళ్ల సంఖ్య మరింత పెరగాలి. కానీ అలా జరుగుతున్న దాఖలాలు ఇక్కడ కనిపించడం లేదు. ప్రస్తుతం ఎన్ని తాబేళ్లు ఉన్నాయో అనే లెక్క కూడా ఆలయ అధికారుల వద్ద లేకపోవడం శోచనీయం. అలాగే తాబేళ్ల పార్కు దగ్గర వాటి సంరక్షణ కోసం విరాళాల సేకరణ కోసం చూపే శ్రద్ధ వాటి పరిరక్షణ మీద లేకపోవడం అత్యంత దారుణమని భక్తులు ఆరోపిస్తున్నారు.

పలాసలో ఉద్రిక్తత



సూదికొండ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులతో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

- చలో సూదికొండను అడ్డుకునేందుకు కఠిన ఆంక్షలు
- రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రి అప్పలరాజు
- సూదికొండలో ఆక్రమణలపై సీదిరి మండిపాటు


కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండలో అక్రమ తవ్వకాలను పరిశీలించడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చలో సూదికొండ కార్యక్రమం ఆదివారం చేపట్టింది. పార్టీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి పిలుపు ఇవ్వడంతో ఉదయాన్నే ఆయనను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సూదికొండ పరిశీలనకు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సిద్ధం కావడంతో.. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు, సీఐలు సూర్యనారాయణ, తిరుపతిరావు, ఎస్‌ఐలు, పదిమంది ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ్బందితో జీఎంఈ కాలనీ, మాజీ మంత్రి నివాసం ఉన్న వీధి ఇళ్లను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మాజీ మంత్రి అప్పలరాజును అడ్డుకుని ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఇది ఉద్రిక్తతకు దారి తీసింది. బయటకు వెళ్లడానికి పోలీసులు ఒప్పుకోకపోవడంతో సీదిరి తన ఇంటి ముందు రోడ్డుపై బైఠాయించారు. సూదికొండలో అన్యాయం జరుగుతోందని, అసలు సూదికొండ ఆక్రమణల్లో ఎవరెవరు ఉన్నాయో అందరి పేర్లు బయటపెడతామన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి సూదికొండకు చేరుకున్నారు.



డీఎస్పీ వెంకటఅప్పారావు మాజీ మంత్రి అప్పలరాజు మధ్య వాగ్వాదం

ఎకరాలకు ఎకరాలు ఆక్రమించారు

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పరిధిలో ఉన్న సూదికొండను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బోడికొండగా మార్చేసిందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సూదికొండ ప్రాంతాన్ని పరిశీలించారు. మంగళగిరిలో నిరుపేదలకు మన ఇళ్లు–మన లోకేష్ అని పట్టాలు పంచుతుంటే పలాస నియోజకవర్గంలో మాత్రం నిరుపేదలు ఇళ్లు కట్టుకుంటే వాటిని తొలగించారని అన్నారు. టీడీపీ నాయకులు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించుకున్నారని అన్నారు. కేంద్రీయ విద్యాలయం పేరుతో సూదికొండలో స్థలాన్ని, అక్రమంగా కంకరను తరలించుకుని పోతున్నారని అన్నారు. ఎనిమిది చోట్ల రాష్ట్రంలో కేంద్రీయ విద్యాలయాలు వచ్చాయని వాటిలో పలాస పేరు లేదన్నారు. పది ఎకరాలు కావాలంటూ సూదికొండ పేదల స్థలాలను నోటీసులు ఇవ్వకుండా తొలగించి శ్మశానంలా చేశారని మండిపడ్డారు. సూదికొండలో టీడీపీ నాయకుడు కొండే నర్సింగరావు, పులారి పాపారావు, జోగ సింహాద్రిలు 51వ సర్వే నంబర్‌ను 362/2/బి సర్వే నంబర్‌తో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, కొండే నర్సింహులు ఆధ్వర్యంలో రెండున్నర ఎకరాలు అమ్మకాలు జరిపారని అన్నారు. పట్టణ ముఖ్య తెలుగుదేశం పెద్ద నాయకుడు లొడగల కామేశ్వరరావు రెండు ఎకరాలు అమ్మకాలు చేశారని అన్నారు. అన్ని ఆధారాలతో ఈ విషయాలు చెబుతున్నానని అన్నారు. తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఉన్నప్పుడే ఇక్కడ ఆన్‌లైన్ మోసాలు ప్రారంభమయ్యాయని, అందుకే ఆయన మళ్లీ ఇక్కడకు వచ్చారని అన్నారు. ఆక్రమణలు తొలగించి స్థానిక పేదలకు న్యాయం చేయాలని కోరారు.



- జిల్లాలో 458 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్
- వీటిలో 111 ఎస్జీటీ పోస్టులు
- 347 స్కూల్ అసిస్టెంట్స్ పోస్టుల భర్తీ
- మిగులు పోస్టులుగా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు
- డీఎస్సీ భర్తీ పోస్టులు కూడా మిగులుగా ఉండే దుస్థితి

శ్రీకాకుళం: సుమారు 16,500 పోస్టులతో డీఎస్సీ షెడ్యూల్‌ను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. జిల్లాకు సంబంధించి 458 పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటిలో 347 స్కూల్ అసిస్టెంట్లు, 111 ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అవలంబించిన అస్తవ్యస్త విధానాలతో ఇప్పటికే జిల్లాలో పలువురు ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉద్యోగులుగా ఉన్నారు. వీరిని సర్దుబాటు చేయటమే విద్యా శాఖ అధికారులకు తలనొప్పిగా ఉండగా డీఎస్సీ పోస్టుల భర్తీ తర్వాత కొత్తగా ఉద్యోగంలోకి చేరిన వారు కూడా మిగులు ఉపాధ్యాయులుగా ఉండే దుస్థితి ఏర్పడుతోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు జూన్ 6 నుంచి జులై 6 వరకు 30 రోజుల పాటు సుదీర్ఘ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు మాసాంతం వరకు 1989, 1992, 1994 డీఎస్సీల్లో భర్తీ అయిన పలువురు ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయనున్నారు. ఆయా ఖాళీల్లో ఇప్పటికే మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి డీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఉపాధ్యాయలను మిగులు ఉపాధ్యాయులుగా చూపించే పరిస్థితి ఉంటుంది.

ఒక్కో బడిలో ఒక్కో నిష్పత్తి

ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు 117 జీఓను ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ దాని కంటే అన్ని వర్గాలకు నష్టం కలిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తీసివేయాలని ఉపాధ్యాయులు కోరుతుండగా అందుకు వ్యతిరేకంగా 1, 2 తరగతులను కూడా కొన్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి దానికి 'బేసిక్ ప్రైమరీ స్కూల్' అని నామకరణం చేశారు. జిల్లాలో ఇలాంటి పాఠశాలలు 130 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:9 ఉండగా మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో 1:11 ఉంది. బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌లో 1:20 నిష్పత్తిని, ఫౌండేషన్ స్కూల్స్‌లో 1:30గా ఉంచాలని నిర్ణయించింది. ఇది పూర్తిగా అశాస్త్రీయం అని విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో పోస్టుల వివరాలు

జిల్లాలో 458 పోస్టులను ప్రకటించగా వీటిలో 347 స్కూల్ అసిస్టెంట్లు, 111 ఎస్జీటీ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లో 335, మున్సిపాలిటీల్లో 12 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. సబ్జెక్ట్‌ల వారీగా పరిశీలిస్తే ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు–34, హిందీ–11, ఇంగ్లిష్–64, గణితం–33, ఫిజికల్ సైన్స్–14, బయోలాజికల్ సైన్స్–32, సాంఘిక శాస్త్రం–66, పీడీ–81 పోస్టులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు–3, హిందీ–1, ఇంగ్లిష్–1, బయోలాజికల్ సైన్స్–1, సాంఘిక శాస్త్రం–5, పీడీ–1 పోస్టులు ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులు విషయానికి వస్తే జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల్లో–72, మున్సిపాలిటీల్లో –39 పోస్టులు ఉన్నాయి. వీటికి గట్టి పోటీ ఏర్పడనుంది. జిల్లా వ్యాప్తంగా 25 వేల వరకు నిరుద్యోగ ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా 458 పోస్టులకు పోటీ పడాల్సి ఉంది.

రెండు మూడు రోజుల్లో ఓ రూపు



జిల్లాల్లో ఖాళీ పోస్టులు, మిగులు పోస్టుల వివరాలు రెండు, మూడు రోజుల్లో తేలనుంది. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాల మేరకు కసరత్తు చేస్తున్నాం. కొన్ని మండలాల్లో మిగులు ఉపాధ్యాయులు ఉండటం వాస్తవమే.

– తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం



తీరం కళకళ

సోంపేట: బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఆదివారం బారువ తీరం పర్యాటకులతో కళకళలాడింది. తీరంలో బోట్లు, విహంగ అడ్వెంచర్స్ సంస్థ ఆధ్వర్యంలో పారాగ్లైడింగ్ నిర్వహించారు. దీని కోసం ఒక వ్యక్తికి రూ.2,000 వసూలు చేశారు. పర్యాటకులు బారువ తీరానికి చేరుకుని సేద తీరారు. ఆదివారంతో బీచ్ ఫెస్టివల్ ముగిసింది.

అంతా చీకటే..



బారువ తీరానికి ఆదివారం సాయంత్రం వేలాది మంది పర్యాటకులు చేరుకున్నారు. అయితే వసతులు కల్పించాల్సిన మండల స్థాయి అధికారులు చేతులెత్తేశారు. దీంతో వేలాది మంది పర్యాటకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కనీస వసతులు కల్పించాల్సిన మండల స్థాయి అధికారులు బాధ్యత విస్మరించారు. బారువ కొత్తూరు గ్రామం నుంచి రహదారి వరకు వీధి బల్బులు లేకపోవడంతో చీకటిలో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. సోంపేట

క్లుప్తంగా

మురుగు పారదు.. దుర్గంధం వదలదు



హీరాపురంలో సవర వీధి నుంచి యూపీ పాఠశాలకు వెళ్లే రహదారిలో మురుగుతో నిండిన కాలువ

మెళియాపుట్టి: పరశురాంపురం పంచాయతీ పరిధిలోని హీరాపురం గ్రామంలోని కాలువలు మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. కాలువలు నిండి మురుగునీరు పారకపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీని వల్ల వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, మురుగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పంచాయతీ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



నారాయణరావు (ఫైల్)

టెక్కలి రూరల్: ఇంట్లో కరెంట్ లేదని, దాన్ని మరమ్మతు చేసే క్రమంలో ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు వదిలేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన పినిమింటి నారాయణరావు(40) అనే వ్యక్తి ఆదివారం తన ఇంట్లో కరెంట్ వచ్చి పోతుండటంతో స్విచ్ బోర్డుకి వచ్చే వైర్లు ఊడిపోవడం గుర్తించి దాన్ని మరమ్మతు చేసేందుకు పూనుకున్నారు. అయితే మరమ్మతు చేసే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందకు పడిపోయారు. దీంతో వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి నారాయణరావు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదించారు. మృతుడు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కీర్తన, మహేష్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

ఆటో..బైక్ ఢీ: విద్యార్థికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో మండలంలోని పెద్దమడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పడాల విజయ్ అనే విద్యార్థి గాయాలపాలయ్యాడు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన విజయ్ ఆదివారం తన మామయ్య శ్రీనుతో కలిసి బైక్‌పై మెళియాపుట్టి నుంచి తన గ్రామానికి వెళ్తున్నాడు. మెళియాపుట్టి గ్రామ శివార్లలో వస్తున్న ఆటోని బైక్ ఢీకొనడంతో వెనుక కూర్చున్న విజయ్ దూరంగా ఎగిరిపడ్డాడు. దీంతో అతడి కాలికి గాయమైంది. వాహనం నడుపుతున్న శ్రీనుకు సైతం గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇద్దరినీ టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం శ్రీకాకుళం తరలించినట్టు తెలిపారు.

ఆశాజనకంగా చోడి పంట



బుచ్చిపేట వద్ద ఆశాజనకంగా చోడి పంట

నరసన్నపేట: మండలంలో చోడి పంట ఆశాజనకంగా ఉంది. మెట్ట భూములతో పాటు సాగునీటి వసతులు ఉన్న పొలాల్లో రైతులు చోడిని వేశారు. రావులవలస, బొరిగివలస, బుచ్చిపేట, మడపాం, నడగాం, జమ్ము, తామరాపల్లితో పాటు గ్రామాల్లో రైతులు చోడిని వేశారు. మండలంలో 90 ఎకరాల్లో చోడి పంట ఉన్నట్లు వ్యవసాయ అధికారులు లెక్కలు తెలుపుతున్నాయి. గతంలో పోల్చితే చోడి పిండి వినియోగం ఆరోగ్య రీత్యా పెరగడంతో రైతులకు ఆదాయం వస్తుంది.

కోడి పందాలు ఆడిన ఐదుగురిపై కేసు నమోదు

సంతబొమ్మాళి: మండలంలోని మర్రిపాడు సమీపంలో కోడి పందేలు నిర్వహించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పకడ్బందీగా పోలీసులు వెళ్లి రూ.3210 నగదు, నాలుగు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దేవుడి మీదే భారం

ఆయనకు కుటుంబం, శివుడు తప్ప మరెవరూ లేరు. నిత్యం శివారాధన తప్ప మరేమీ తెలీదు. ఏళ్ల తరబడి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నా సెంటు భూమి కొనలేకపోయారు. చిల్లిగవ్వ కూడా వెనకేసుకోలేకపోయారు. ఇప్పుడు ఆపత్కాలంలో ఆర్థిక స్థోమత చాలక ఆపసోపాలు పడుతున్నారు. భర్తకు సాయం చేయడం తప్ప మరేమీ తెలీని ఆ ఇల్లాలు ఇప్పుడు కూలి పనికి వెళ్లి పిల్లల కడుపు నింపుతున్నారు. మెదడుకు శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితుల్లో.. దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.



తలకు చేసిన ఆపరేషన్



బాధితుడితో భార్య, పిల్లలు (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న అర్చకుడు

- ప్రాణాపాయ స్థితిలో ఆలయ అర్చకుడు
- తలకు ఆపరేషన్ కోసం సరిపోని ఆర్థిక స్థోమత
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

పొందూరు: మండలంలోని మలకాం గ్రామానికి చెందిన విభూది నీలకంఠం శివాలయంలో అర్చకునిగా పనిచేసేవారు. అదే ఆయనకు జీవనోపాధి. సెంటు భూమి కూడా లేదు. ఆయనకు భార్య సరస్వతి, పిల్లలు ధనలక్ష్మి, హరినాథ రావు ఉన్నారు. భక్తులు ఇచ్చే దక్షిణలు, రేషన్ బియ్యంతో కుటుంబ పోషణ జరిగేది. ఏడాది కిందట నీలకంఠం మలకాం గ్రామానికి పక్కనే ఉన్న పైడాయవలసలోని శివాలయానికి పూజలు చేసేందుకు వెళ్తుండగా అనుకోని ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి వాహనంతో ఢీకొట్టడంతో పంట పొలాల్లో పడిపోయారు. సుమారు గంట సమయం పాటు స్పృహలో లేరు. అటుగా వెళ్తున్న వారు ఆయనను గుర్తించారు. కాళ్లు, చేతులకు వైద్య సేవలందించి ఇంటికి అప్పగించారు. అయితే తలకు కనపడని గాయం ఏర్పడిన విషయం తెలియలేదు. నెలలు గడుస్తుంటే ఒకే మాటను పది సార్లు చెప్పడం, మనుషులను గుర్తించలేకపోవడం, పనిలో శ్రద్ధ తగ్గిపోవడం వంటివి కనిపించాయి. దీంతో పలు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించారు. మందులు వాడారు. చాలా నెలల తర్వాత మెదడులో రక్తం గడ్డం కట్టిందని గుర్తించారు. ఇటీవలే రాగోలు ఆస్పత్రిలో తలకు ఆపరేషన్ చేయించారు. సుమారు రూ.లక్ష 50 వేల వరకు అప్పుల పాలయ్యారు. ఈ అప్పు తీర్చేందుకు అర్చకుడి భార్య కూలి పనులకు వెళ్తున్నారు. అయినా ఆ కుటుంబానికి ఇప్పుడు పూట గడవడం లేదు. చాలా దయనీయమైన పరిస్థితిలోకి వెళ్లిపోయారు.

ఇలాంటి దశలో ఇప్పుడు ఆయనకు మరో పెద్ద ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూట గడవడానికే ఇబ్బంది పడుతున్న దశలో మరోసారి ఆపరేషన్ ఎలా చేయించాలో తెలీక వారు సతమతమవుతున్నారు. పిల్లలకు ఒక పూట తిండి పెడితే మరో పూట పెట్టలేని పరిస్థితిలో భార్య ఉంది. భర్త పూర్తిగా పడుకుని ఉండడమే తప్ప మరేమీ చేయలేకపోతున్నారు. శివాలయంలో పూజారిగా ఉండటంతో ప్రజలు అప్పుడప్పుడు కొంత సాయం చేస్తున్నారు. ఆపరేషన్ చేయించాలంటే దాతల సాయం ఒక్కటే మార్గమని వారు కోరుతున్నారు. ఎంత ఖర్చవుతుందన్న విషయాన్ని డాక్టర్లు ఇంకా స్పష్టం చేయలేదు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

• తవ్వేసి.. వదిలేశారు



కలిగాం సమీపంలో కల్వర్టు నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన గొయ్యి

మండలంలోని కలిగాం-అంగూరు రోడ్డు వద్ద కలిగాం సమీపంలో వరద కాలువ నిర్మాణంలో భాగంగా కల్వర్టు నిర్మాణం కోసం వంశధార ఇంజినీరింగ్ అధికారులు రోడ్డును తవ్వించారు. అయితే ఎంతకూ కల్వర్టు నిర్మాణం చేయకపోవడంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. రోడ్డుకు ఆనుకుని సుమారు 10 అడుగుల లోతులో తవ్వడంతో వర్షం పడితే రోడ్డు కూలిపోయే ప్రమాదం దాపురించింది.

కొత్తూరు

గడువు తీరిన మందులను చట్టబద్ధంగా కాల్చుతాం



రెయిన్‌బో ఇండస్ట్రీస్ ప్రతినిధులతో ఒప్పంద పత్రం, కరపత్రాలతో ఏడీ చంద్రరావు

శ్రీకాకుళం క్రైమ్ : గడువు తీరిన మందులను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి పొందిన బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా కాల్చుతామని జిల్లా డ్రగ్ ఏడీ చంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇదివరకు ఏవైనా గడువు తీరిన (ఎక్స్పైరీ) మందులు కొన్నింటికి కంపెనీలు రిటర్న్ పాలసీ కింద డబ్బులు చెల్లించేవని, మరికొన్నింటికి పాలసీ లేకపోవడంతో సంబంధిత ఫార్మా, జనరిక్, పీసీడీ డిస్ట్రిబ్యూటర్స్ బహిరంగ ప్రదేశాల్లో కుప్పలుగా పెట్టి కాల్చేయడమో.. లేదంటే పూడ్చేయడమో చేసేవారన్నారు. ఇలా చేయడం వల్ల పర్యావరణానికి, మానవ మనుగడకి ప్రమాదమని అన్నారు. తాజాగా జిల్లాలోని లావేరులో ఉన్న రెయిన్‌బో ఇండస్ట్రీస్‌తో ఒప్పందం అయ్యిందని, బయో వేస్ట్ వెహికల్‌లో అక్కడికి తీసుకెళ్లి కాల్చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలిసారి మన జిల్లాలోనే ఈ ప్రక్రియ మొదలు పెట్టామని, త్వరలోనే డిస్ట్రిబ్యూటర్స్, మందుల దుకాణాల వారితో సమావేశంలో అంతా వివరిస్తామన్నారు. రెయిన్‌బో ఇండస్ట్రీస్ ప్రతినిధులు, జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నూర్పు చేస్తుండగా మంటలు



శాలిపేట గ్రామంలో అగ్నికి ఆహుతవుతున్న ట్రాక్టర్ ఇంజిన్, వరి చేను

టెక్కలి: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం పంచాయతీ శాలిపేట గ్రామంలో ఆదివారం వరి చేను నూర్పు చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగి ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయింది. మరో వైపు మంటల ధాటికి వరి చేను కూడా కాలిపోయింది. హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన బల్లి అప్పలరాజు తన ట్రాక్టర్, నూర్పు యంత్రంతో శాలిపేట గ్రామానికి చెందిన మార్పు భూషణం అనే రైతుకు చెందిన సుమారు 2 ఎకరాల వరిచేనును నూర్పు చేస్తుండగా, అకస్మాత్తుగా ట్రాక్టర్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనతో అంతా పరుగులు తీశారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించి ట్రాక్టర్ ఇంజిన్ మొత్తం అగ్నికి ఆహుతి కాగా మరో వైపు వరి చేను కాలిపోయింది. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోగా అంతా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో ఒక వైపు ట్రాక్టర్ యజమాని అప్పలరాజు, మరో వైపు రైతు భూషణం తమకు జరిగిన భారీ నష్టంతో బోరున విలపించారు.

26న సీఎం చంద్రబాబు ఎచ్చెర్ల పర్యటన

రణస్థలం: ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని బుడగట్లపాలెం, జీరుపాలెం, కొవ్వాడ మత్స్యకార గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుతో పాటు ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం పర్యటించారు. ఈ నెల 26న సీఎం చంద్రబాబునాయుడు ఎచ్చెర్ల నియోజకవర్గంలో మత్స్యకార భరోసా కార్యక్రమం ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు, కూటమి నాయకులు స్థల పరిశీలన చేశారు.

22న మంత్రి రామానాయుడు జిల్లా పర్యటన

శ్రీకాకుళం: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 22వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం రాజమండ్రి నుంచి శ్రీకాకుళం చేరుకుని వంశధార ఎడమ కాలువ (ఎల్‌బీసీ), హిరమండలం రిజర్వాయర్ పనులను తనిఖీ చేస్తారు. జిల్లాలోని ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టులపై శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం మీడియాతో మాట్లాడతారని, అనంతరం విజయనగరం బయల్దేరి వెళతారని కలెక్టర్ తెలిపారు.

లాడ్జీలు తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పలు లాడ్జిలను శనివారం అర్ధరాత్రి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాడ్జీల్లో రికార్డు నిర్వహణ, కొత్త వ్యక్తుల వివరాలు, అనుమానితుల సమాచారం గురించి యాజమాన్యాన్ని ఆరా తీశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పవన్ అనాలోచిత నిర్ణయాలతో రైతులకు తీవ్ర నష్టం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



టెక్కలిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనాలోచిత నిర్ణయాలతో ఈ రోజు బియ్యం ఎగుమతులు లేక రైతులు తీవ్రమైన నష్టాలకు గురవుతున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మండిపడ్డారు. ఆదివారం టెక్కలిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీజ్ ద షిప్ వ్యవహారంలో అక్రమాలను వెలికితీస్తామని చెప్పి ఎందుకు మౌనంగా ఉన్నారని దువ్వాడ ప్రశ్నించారు. గతంలో ఏపీ నుంచి విస్తారంగా సన్న రకాలు ఎగుమతులు జరిగాయని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.2900 ధర పలికిన సన్న రకాల ధర ఈ రోజు రూ.1700కు పడిపోయిందని అన్నారు. అవి కూడా కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. సన్న రకాలను ప్రోత్సహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన ప్రకటనలతో ఉత్తరాంధ్రతో పాటు ఇతర జిల్లాల్లో విస్తారంగా సన్న రకాలు పండించారని, ఇప్పుడు ధరలు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని దువ్వాడ మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో విత్తు నుంచి విక్రయం వరకు. రైతుల సంక్షేమం కోసం అధికారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసిన పరిస్థితులను ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం నుంచి సుమారు 31 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, ఇదే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గతంలో గోల చేశారని ఇప్పుడు అదృశ్యమైన మహిళల్ని ఎందుకు తీసుకురావడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రెండు బడ్జెట్‌లలో ఉత్తరాంధ్రకు వచ్చిన ప్రయోజనమేమిటని దువ్వాడ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాది కాలంలో సుమారు 80 శాతం పనులు పూర్తి చేశారని ఇప్పుడు టీడీపీ నాయకులు పోర్టు కాంట్రాక్టుల కోసం కుమ్ములాడుకుంటున్నారు తప్ప పోర్టును పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. బారువాను మరో గోవా చేస్తామంటూ ఇటీవల కేంద్ర మంత్రి చేసిన ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని శ్రీనివాస్ అన్నారు. లింగాలవలస గ్రామంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రగల్భాలు పలకడం ఆపేసి ఎన్నికల మునుపు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యాంత్రీకరణతో రైతులకు ప్రయోజనం



రైతులకు వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కలెక్టర్, ఎమ్మెల్యే

కంచిలి: వ్యవసాయ యాంత్రీకరణ విధానంతో రైతులకు చక్కని ప్రయోజనాలు కలుగుతాయని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో వ్యవసాయ యంత్ర పనిముట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం చేపట్టారు. ఇందులో నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు 236 వ్యవసాయ యంత్రాలను రూ.37.02 లక్షలు విలువ చేసినవి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి పంపిణీ చేశారు. సబ్సిడీ ధరలకు వీటిని రైతులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు పి.జగన్మోహనరావు, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మెమో 57ను అమలు చేయాలి



మాట్లాడుతున్న కొత్తకోట శ్రీహరి

శ్రీకాకుళం అర్బన్: జనవరి 1, 2004కు ముందు నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెమో 57ను తక్షణమే అమలు చేయాలని మెమో 57 ఉద్యోగ, ఉపాధ్యాయ సాధన సమితి జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం మెమో 57 సాధన సమితి జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రాప్తికి అర్హత ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. ఇందుకు కూటమి ప్రభుత్వం తమ యువగళం పాదయాత్రలో లోకేష్ మాట ఇచ్చారని వారు తమ మాట నిలబెట్టుకొని మెమో 57ను అమలు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. జనవరి 1, 2004కు ముందు నోటిఫికేషన్ వచ్చి కొన్ని అడ్మినిస్ట్రేటివ్ కారణాల వల్ల జాయినింగ్స్ లేట్ అయినప్పటికీ పీఎఫ్ ఆర్‌డీఏ చట్టం అమలుకు ముందే నోటిఫికేషన్ వచ్చినందున వీరందరూ పాత పెన్షన్‌కి అర్హులేనని అన్నారు. అందుకోసం అర్హత కలిగిన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11,000 మందికి పాత పెన్షన్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

ఒడిశాకు తరలుతున్న పశుగ్రాసం



పాతపట్నం మీదుగా ట్రాక్టర్‌తో ఒడిశాకు వెళుతున్న వరి గడ్డి

పాతపట్నం: పాతపట్నం పరిసర ప్రాంతాల నుంచి వరి గడ్డివాములు ట్రాక్టర్లతో ఒడిశాకు తరలిస్తున్నారు. ఒడిశాలో వరి గడ్డి(పశుగ్రాసం)కి భారీ డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో సరిహద్దులు దాటుతోంది. పాతపట్నం, కొత్తూరు, మెళియాపుట్టి మండలాల నుంచి ప్రతి రోజు సాయంత్రం, రాత్రి పూటల్లో ఒడిశాకు వరిగడ్డి ట్రాక్టర్లు ద్వారా తీసుకు వెళ్తున్నారు. ఇటీవల వరి పంటలు యంత్రాలతో వరి చేను కోయడం వల్ల వరి గడ్డికి డిమాండ్ ఏర్పడింది. స్థానికంగా ట్రాక్టర్ వరి గడ్డి రూ.5 వేలు నుంచి రూ.7 వేలు వరకు ధర ఉంది.

దీంతో దళారులు ఇక్కడి రైతులతో వీలైనంత మేర కొనుగోలు చేసి, ఒడిశాకు తీసుకెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి, వేసవిని దృష్టిలో ఉంచుకుని గడ్డి కొరత రాకుండా ప్రభుత్వమే రైతుల నుంచి గడ్డి సేకరించి, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పాడి రైతులు సూచిస్తున్నారు.

• భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కీస్టోన్ చర్చిలో ప్రార్థనలు



శ్రీకాకుళంలోని సమాధుల వద్ద పితృదేవతల ఆరాధన

ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే తర్వాత క్రీస్తు మళ్లీ లేచిన సందర్భంగా గుర్తు చేసుకుని.. సమాధుల వద్దకు వెళ్లి పితృదేవతలకు ప్రార్థనలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

అల్లాడుతున్న మూగజీవాలు



బసవరాజుపేట గ్రామం వద్ద చెట్టు నీడకు చేరిన గొర్రెల మంద

ఎల్.ఎన్.పేట: వేసవి ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతోంది. గత కొన్ని రోజులుగా వీస్తున్న వడగాలులకు మనుషులతో పాటు మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండ వేడి తీవ్రత, వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉందని గొర్రెల కాపర్లుతో పాటు పలు గ్రామాల వారు తెలిపారు. మరోవైపు చెరువుల్లో నీరులేక ఎండిపోవటంతో మూగ జీవాలకు తాగునీరు అందివ్వలేని దుస్థితి ఏర్పడిందని గొర్రెలు, మేకల కాపర్లు ఆందోళన చెందుతున్నారు.